
నగరంలో చిరు జల్లులు

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎండవేడిమితో అల్లాడుతున్న నగర ప్రజలకు కాస్త ఊరటనిచ్చినట్లయ్యింది. గురువారం సాయంత్రం నగరంలోని కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. కొన్ని చోట్ల తుంపరజల్లులు కురిశాయి హనుమంతనగర్‌లో ఈదురుగాలులకు చెట్టు విరిగి కారు మీదపడింది. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మండిపోతున్న ఎండలతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవతుతున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో వర్షం కురవడంతో వేడి నుంచి కొంత ఉపశమనం కలిగింది. వర్షం కోసం నగరవాసులు ఎదురుచూపులు చూస్తున్నారు.

మాస్ రేపిస్ట్‌కు మద్దతుగా..
ప్రచారమా..?



రాజ్యాంగాన్ని చూపుతున్న రాహుల్ గాంధీ



- ప్రజ్వల్‌కు ఓటెయ్యమన్న ప్రధాని మోదీ మహిళలకు క్షమాపణ చెప్పాల్సిందే
- కేంద్ర సహకారం లేకుండా విదేశాలకు ఎలా వెళ్తారు..?
- రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు
- శివమొగ్గ సభలో రాహుల్‌గాంధీ ఆగ్రహం

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మాస్ రేపిస్ట్ హాసన్ జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు మద్దతుగా ప్రచారం చేసిన ప్రధాని మోదీ రాష్ట్ర మహిళలను క్షమాపణ కోరాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. గురువారం శివమొగ్గలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌తోపాటు నటుడు శివరాజ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా వేలాదిమంది ప్రజలు బహిరంగసభలో పాల్గొనగా రాహుల్‌గాంధీ ప్రసంగించారు. ప్రజ్వల్ రేవణ్ణ మాస్ రేపిస్ట్ అనే విషయం తెలిసినా అతడి తరపున లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేసిన ప్రధాని నరేంద్రమోదీ దేశంలోని మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 33ఏళ్ల జేడీఎస్ ఎంపీ ఇంతటి దారుణానికి పాల్పడిన విషయం ముందుగానే బీజేపీకి తెలుసన్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ నాయకులంతా మహిళలకు క్షమాపణలు చెప్పాల్సిందేనన్నారు. ఇటువంటి మాస్ రేపిస్ట్‌కు మద్దతుగా ప్రచారం చేయడం సమంజసమా అన్నారు. ఏకంగా 400మంది మహిళలపై లైంగిక దౌర్జన్యాలకు పాల్పడిన ప్రజ్వల్ విదేశాలకు వెళ్లేందుకు ఎవరు సహకరించారన్నారు. అయినా మైసూరు ఎన్నికల ప్రచారసభలో ప్రజ్వల్ తరపున ప్రధాని ప్రచారం చేశారన్నారు. ప్రజ్వల్‌కు ఓటు వేస్తే తనకు సాయం చేసినట్లే అని మోదీ కర్ణాటక ప్రజలను కోరారన్నారు. ప్రజ్వల్ ఏం చేశారనేది ప్రతి మహిళా తెలుసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు.

- లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ వారు రాజ్యాంగాన్ని మార్పు చేయాలని, నాశనం చేయదలిచారని అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం రక్షణలో మనమంతా ఉన్నామన్నారు. అందుకు అంబేడ్కర్‌కు ధన్యవాదాలు తెలపాలన్నారు. రాజ్యాంగంలో అందరికీ సమానత ఉండాలని పొందుపరిచారన్నారు. కానీ బీజేపీ వారు రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను తొలగించేందుకు కుట్ర పన్నారన్నారు. సమానత్వం కోరేవారు నక్సల్స్ అంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారని, అయితే ప్రధాని మోదీ రాజ్యాంగరక్షణ గురించి మాట్లాడతారన్నారు. ప్రధాని మోదీ పదేళ్లలో కేవలం 22మంది శ్రీమంతులకోసం పనిచేశారని, వారికి 16 లక్షల కోట్ల రూపాయలు రుణ మాఫీ చేశారన్నారు.



సభా వేదికపై రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివ కుమార్, శివ రాజ్ కుమార్



ఎన్నికలప్పుడే ప్రధానికి కర్ణాటక జ్ఞాపకం : సీఎం

కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కర్ణాటక గుర్తుకొస్తుందని సీఎం సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శివమొగ్గ సభలో మాట్లాడిన సీఎం 2019లో తీవ్రమైన వరదలు వచ్చాయని అప్పుడు ప్రధాని రాష్ట్రానికి రాలేదన్నారు. ఈ ఏడాది తీవ్రమైన కరువుతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతున్నా పరిహారం ఇచ్చేందుకు స్పందించలేదన్నారు. సుప్రీంకోర్టు సూచనతో రాష్ట్రానికి పరిహారం వచ్చిందన్నారు. శివమొగ్గలో ఎంపీగా చెప్పుకునేందుకు తప్ప రాఘవేంద్ర సాధించిందేమీ లేదన్నారు. రాష్ట్రానికి సంబంధించిన అంశాలను పార్లమెంటులో వినిపించేవారిని గెలిపించాలన్నారు. రాష్ట్రం కోసం, జిల్లా కోసం అటువంటి వారే అవసరమన్నారు. పదేళ్లలో ప్రధాని ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ప్రతి వ్యక్తి ఖాతాకు రూ.15లక్షలు సాధ్యం కాలేదని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు అమలు చేయలేదని, నిత్యావసర ధరలు తగ్గలేదని, అచ్చేదిన్ రాలేదన్నారు. నిత్యావసరాల ధరలతో సామాన్య ప్రజలు తల్లడిల్లుతున్నారన్నారు. రాష్ట్రంలో ఐదు గ్యారెంటీలు ప్రతి కుటుంబానికి అండగా ఉన్నాయన్నారు. కొప్పళలో ఓ మహిళ గృహలక్ష్మి సొమ్ముతో ఉంగరం చేయించుకున్నారని సీఎం ప్రస్తావించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా గ్యారెంటీలు అమలు ఖాయమన్నారు. లోక్‌సభలో కర్ణాటక సమస్యలు మాట్లాడేవారికి మద్దతు ఇవ్వాలని కోరారు. 25మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గీతా శివరాజ్‌కుమార్‌ను గెలిపించాలని ఈ సందర్భంగా ఓటర్లను కోరారు.

లుక్ ఔట్..!

- లుక్ అవుట్ నోటీసులతో ప్రజ్వల్‌కు ఉచ్చు
- చిక్కుల్లో రేవణ్ణ కుటుంబం
- ముందస్తు బెయిల్‌కు హైకోర్టులో పిటిషన్
- మా కుటుంబంపై రాజకీయ కుట్ర
- హాసన్‌లో ప్రజ్వల్ గెలుపు ఖాయం : సూరజ్

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాసలీలల ఎంపీ ప్రజ్వల్ వివాదంపై దర్యాప్తు బృందం మరిన్ని చర్యలకు సిద్ధమైంది. దర్యాప్తు ప్రారంభించిన సిట్ ప్రజ్వల్‌పై మరింత ఉచ్చు బిగిస్తోంది. 24 గంటల్లోగా సిట్ ముందు హాజరు కావాలనే నోటీసులకు న్యాయవాది ద్వారా ఏడు రోజుల గడువు కోరిన విషయం తెలిసిందే. అయితే ఆ వినతిని సిట్ అధికారులు తిరస్కరించారు. ఆ వెంటనే లుక్ అవుట్ నోటీసులను జారీ చేశారు. దీన్నిబట్టి ప్రజ్వల్ ఏ దేశంలో ఉన్నా అతడి పాస్‌పోర్ట్ ఆధారంగా గుర్తించేందుకు వీలుంది. మరోవైపు ప్రభుత్వం ప్రజ్వల్ కేసుకోసం ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా బీఎన్ జగదీశ్‌ను నియమించింది. మరోవైపు ఈ వివాదంలో ఏ1 గా ఉన్న రేవణ్ణ సిట్ ముందు హాజరు కాలేదు. కలబురగిలో హోం మంత్రి మీడియాతో మాట్లాడుతూ తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. హొళెనరసీపురలో దాఖలైన లైంగిక దౌర్జన్యాల కేసులో రేవణ్ణ విచారణకు హాజరు కావడం జాప్యం చేస్తే అరెస్టు తప్పదని హెచ్చరించారు. ప్రజ్వల్‌ను ఎవరూ రక్షించలేరని లుక్ అవుట్ నోటీసులు జారీ చేశామన్నారు. లుక్ అవుట్ నోటీసు తర్వాత కూడా అతను అందుబాటులో లేకపోతే కోర్టు ద్వారా నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తారన్నారు. రేవణ్ణ ఇంట్లో పనిమనిషితోపాటు కుమార్తెల ఫిర్యాదుతో ఇద్దరిపైనా కేసు నమోదు చేశారు. తాజాగా మరో మహిళ పోలీసులను ఆశ్రయించి లైంగిక దౌర్జన్యంపై ఫిర్యాదు చేశారు. మరో బాధిత మహిళ సిట్ ముందు హాజరై తమ సమస్యను వివరించారు.



ముందస్తు బెయిల్‌కోసం హైకోర్టులో పిటీషన్

లైంగిక దౌర్జన్యాల కేసులో నిందితుడిగా సిట్ నోటీసు జారీ చేసిన మేరకు ఎమ్మెల్యే రేవణ్ణ ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. ప్రజా ప్రతినిధుల కోర్టులో సీసీహెచ్ 82లో పిటీషన్ దాఖలు చేశారు. న్యాయమూర్తి సంతోష్ గజనానభట్ గురువారం విచారణ జరిపారు. రేవణ్ణ తరపున సీనియర్ న్యాయవాది, మూర్తి వీ నాయక్ హాజరయ్యారు. విచారణ శుక్రవారానికి వాయిదా వేశారు.

- ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దౌర్జన్యాలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని, దేవెగౌడ కుటుంబం రాజకీయాలను వీడాలని కేంద్ర మాజీ మంత్రి వీరప్పమొయిలీ డిమాండ్ చేశారు. బెళగావిలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మొయిలీ గురువారం మీడియాతో మాట్లాడుతూ పెన్‌డ్రైవ్‌లు విడుదల చేసింది ఎవరనేది ముఖ్యం కాదని, ప్రజ్వల్ నీచ చర్యలకు పాల్పడ్డాడా లేదా..? అనేది ముఖ్యమన్నారు. దేవెగౌడ కుటుంబం రాజకీయాలను వీడాలని డిమాండ్ చేశారు.



- ప్రజ్వల్ రేవణ్ణ సోదరుడు, ఎమ్మెల్సీ సూరజ్ రేవణ్ణ హొళెనరసీపురలో మీడియాతో మాట్లాడుతూ హాసన్‌లో ప్రజ్వల్ గెలుపు వందశాతం సాధ్యమన్నారు. ఇదంతా తమ కుటుంబాన్ని రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర అన్నారు. కార్యకర్తల్లో గందరగోళం లేదని, బుధవారం కూడా కార్యకర్తల సమావేశాలు నిర్వహించామన్నారు. ప్రజ్వల్ బెంగళూరుకు ఎప్పుడు వస్తారనేది తెలియదన్నారు. డీసీఎం డీకే శివకుమార్‌ను ఎన్నికలకు ముందు బెంగళూరులో కలిశానన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక హొళె నరసీపురలో ఉన్నానన్నారు. కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ మమ్మల్ని అనవసరంగా రెచ్చగొట్టారని, అంత సులభంగా వదిలేది లేదన్నారు. తనను అనవసరంగా వివాదంలోకి లాగారన్నారు. ఆ డ్రైవర్ ఓ వీడియో సందేశం పంపాడని, అతడు ఏమైనా ప్రెస్‌మీట్‌లో మాట్లాడారా..? అని ప్రశ్నించారు. చిల్లర అన్నదమ్ములు కుమారస్వామి వీడియో విడుదల చేశారని డీసీఎం డీకే శివకుమార్ సోదరులను ఉద్దేశించి మండిపడ్డారు. కుట్ర లేదంటే ఒకేసారి అంత పెద్దస్థాయిలో హాసన్‌లో పెన్‌డ్రైవ్‌లు పడేసింది ఎవరని, డ్రైవర్ కార్తీక్‌ను మలేషియాకు ఎవరు పంపారని ప్రశ్నించారు.



6 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు

- 9న నోటిఫికేషన్
- మూడు పట్టభద్రులు.. మూడు ఉపాధ్యాయులు
- జూన్ 3న పోలింగ్

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్‌లో త్వరలో ఖాళీ అయ్యే 4 ఎమ్మెల్సీ స్థానాలతోపాటు ఇటీవల ఇద్దరు సభ్యుల రాజీనామాతో కలిపి 6 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ మేరకు గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. 6 స్థానాల్లో మూడు పట్టభద్రులు, మూడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు ఉన్నాయి. కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందిన డాక్టర్ చంద్రశేఖర్ బా పాటిల, బెంగళూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఏ దేవెగౌడ, ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి, కర్ణాటక నైరుతి విభాగం ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎస్ఎల్ భోజేగౌడల పదవీకాలం జూన్ 21తో ముగియనుంది. నైరుతి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆయనూరు మంజునాథ్ గత ఏడాది ఏప్రిల్ 19న పదవికి రాజీనామా చేయగా దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ మరితిబ్బేగౌడ ఇటీవల మార్చి 21న రాజీనామా చేశారు. ఆరుస్థానాల్లో ఖాళీ ఏర్పడడంతో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం ఎన్నికలకు సిద్ధమయ్యింది. ఈమేరకు 6 స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈనెల 9న నోటిఫికేషన్ జారీ కానుంది. అదే రోజునుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. 16వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. 17న నామినేషన్ల పరిశీలన 20వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉంది. జూన్ 3న సోమవారం ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ కొనసాగనుంది. 6వ తేదీన ఓట్ల లెక్కింపు కొనసాగనుండగా జూన్ 12తో ఎన్నికల ప్రక్రియ ముగియనుంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల వేడి సాగుతున్న తరుణంలోనే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ రావడంతో పార్టీల్లో మరింత హడావుడి నెలకొంది.

నిప్పు రగిలినా.. తప్పించుకున్నారు..



- గతంలో ముగ్గురు మంత్రులపైనా రాసలీలల ఆరోపణలు
- వివాదాలు సద్దుమణగడంతో అంతా సేఫ్..

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాసలీలల వివాదం కొత్తేమీ కాదు..అయితే అప్పటికప్పుడు సంచలనాలు కలిగించినా ఆ తర్వాత సమసిపోయిన సందర్భాలు ఉన్నాయి. రాష్ట్రంలో మంత్రులుగా కొనసాగిన వారిపైన వచ్చిన రాసలీలల వివాదాలు కొంతకాలం తర్వాత సద్దుమణిగి వారు రాజకీయాల్లో కొనసాగుతున్న అంశాలపై చర్చలు సాగుతున్నాయి.

- సిద్దరామయ్య కేబినెట్‌లో అబ్కారీ మంత్రిగా వ్యవహరించిన హెచ్‌వై మేటిపై 2016 డిసెంబరు 12న లైంగిక ఆరోపణలు వచ్చాయి. ఆయనకు సంబంధించిన సీడీలు విడుదలయ్యాయి. మేటి మంత్రి పదవికి రాజీనామా చేశారు. కేసును సీఐడీకి అప్పగించగా ఏడాదిలోనే క్లీన్‌చిట్ ఇచ్చారు. పోలీసుల చార్జ్‌షీట్‌కు అనుగుణంగా కోర్టు నుంచి కూడా విముక్తి లభించింది. గత ఏడాది బాగల్కోటె నుంచి మరోసారి ఎమ్మెల్యే అయ్యారు.
- 2009 లో ఆహారశాఖ మంత్రిగా వ్యవహరించిన హర్తాళు హాలప్ప స్నేహితుడి భార్యపై అత్యాచారం చేసిన ఆరోపణలు ఎదుర్కొన్నారు. వివాదం బహిరంగమైన ఆరు నెలలకు కేసు నమోదైంది. అప్పటి యడియూరప్ప ప్రభుత్వం సీఐడీకి అప్పగించారు. ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయగా 2010 మేలో అరెస్టు అయ్యారు. ఏడేళ్ల విచారణ సాగగా 2017లో కేసును కొట్టివేశారు. ఆరోపణల్లో వాస్తవాలు లేవని శివమొగ్గ రెండో సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. 2018లో జరిగిన ఎన్నికల్లో సాగర్ నుంచి హర్తాళు హాలప్ప గెలుపొందారు.
- తాజాగా 2021లో జలవనరులశాఖ మంత్రిగా వ్యవహరించిన రమేశ్ జార్కిహొళి సీడీలు వైరల్ అయ్యాయి. అప్పటి సీఎం యడియూరప్ప సూచన మేరకు పదవికి రాజీనామా చేశారు. ఐపీఎస్ అధికారి సౌమేందు ముఖర్జీ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశారు. ఆరు నెలల్లో సిట్ 150 పేజీల నివేదికను కోర్టుకు సమర్పించింది. ఇద్దరూ పరస్పరం అంగీకారంతో లైంగికంగా పాల్గొన్నారని, ఇక్కడ దౌర్జన్యానికి అవకాశమే లేదని బీ రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం హైకోర్టు దశలో విచారణలు కొనసాగుతున్నాయి. ఈలోగానే రమేశ్‌జార్కిహొళి గోకాక్ నుంచి మరోసారి ఎమ్మెల్యే అయ్యారు.

యువతితో ఎమ్మెల్యే వాట్సప్‌కాల్.. ఇద్దరిపై ఎఫ్ఐఆర్

రామనగర కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్ జిల్లా కాంగ్రెస్ పదాధికారి అయిన యువతితో వాట్సప్‌కాల్ సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. ఈమేరకు రామనగర సీఈఎన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాంగ్రెస్ పార్టీలో పదాధికారిగా ఉన్న 25 ఏళ్ల యువతి స్వయంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మేరకు ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్‌తో తనకు తండ్రి లాంటి సంబంధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనతోపాటు ఏ మహిళతోనూ ఎమ్మెల్యే అసభ్యంగా ప్రవర్తించలేదని పేర్కొన్నారు. వీడియోకాల్ మాట్లాడినట్టు అశ్లీల వీడియో సృష్టించి తమ్మణ్ణగౌడ గుణ్కల్ అనే వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా షేర్ చేశారన్నారు. తన పరువుకు భంగం కలిగించారని, వారందరిపైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వక్ఫ్‌బోర్డ్‌కు వెటర్నరీ స్థలం

- ప్రభుత్వ ఆదేశాలకు హైకోర్టు బ్రేక్

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర నడిబొడ్డున కోట్లాది రూపాయల విలువ చేసే చామరాజపేట పశువైద్యశాల భూమిని వక్ఫ్‌బోర్డుకు అప్పగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలకు హైకోర్టు బ్రేక్ వేసింది. దశాబ్దాలకాలంగా ఉండే పశువైద్యశాల ప్రాంతం పెంపుడు జంతువులు, పశువులకు ఎంతో సౌకర్యంగా ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల ఆసుపత్రి భూమిని వక్ఫ్‌బోర్డుకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ ఉండే పశువుల ఆసుపత్రిని మరోచోటుకు మార్పు చేసింది. ప్రభుత్వ ఆదేశాలను ప్రశ్నిస్తూ చామరాజపేట ప్రజల తరపున శశాంక్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. గురువారం విచారణ జరిపిన ధర్మాసనం వక్ఫ్‌బోర్డుకు బదిలీ చేసిన ఆదేశాలను పెండింగ్‌లో పెట్టారు. చామరాజపేట పశువుల ఆసుపత్రి యథావిధిగా కొనసాగించాలని ఆదేశించింది. రెండు ఎకరాల స్థలాన్ని ముస్లిం సామాజిక వర్గ సంక్షేమం కోసం అంటూ కేటాయించారు. ఈ స్థలం ప్రభుత్వానికి మరాఠా నేత ఒకరు పశువులకు తగిన చికిత్స అందించేందుకు ఆసుపత్రి ఉండాలని అప్పగించారు. న్యాయమూర్తులు శివశంకరగౌడ, శ్యామ్‌ప్రసాద్‌ల ధర్మాసనం తీర్పునిచ్చింది.






ఆర్టీసీలో క్యాష్‌లెస్ జర్నీ

- యూపీఐ పేమెంట్‌తో ప్రయాణికులకు, సిబ్బందికి రిలీఫ్

బెంగళూరు మెట్రో, మే 2: కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ) బస్సుల్లో క్యాష్‌లెస్ ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ప్రయాణికులకు నగదుకు బదులుగా యూపీఐ చెల్లింపుల ప్రక్రియ సాకారం కానుంది. ఇప్పటికే కండక్టర్లకు పంపిణీ చేసిన ఎలక్ట్రానిక్ టిక్కెటింగ్ మిషన్‌ల ద్వారా యూపీఐ చెల్లింపులు జరిపే ప్రక్రియ అమలు చేయనున్నట్లు కేఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి 'ఇబిక్స్' క్యాష్ లిమిటెడ్ కంపెనీతో 5 సంవత్సరాల ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 10,245 టిక్కెటింగ్ మిషన్లకు ఈ ప్రక్రియ అమర్చామన్నారు. మరో 15వేల కొత్త మిషన్లను కొనుగోలు చేస్తామన్నారు. టిక్కెటింగ్ మిషన్‌లకు నూతన సాంకేతిక పరిజ్ఞానం జోడించడంతో ఇంటెలిజెంట్ ట్రావెల్ మేనేజిమెంట్ ద్వారా వీటి నిర్వహణ సులభతరం అవుతుందన్నారు.
ఈ ప్రక్రియ అమలులోకి వస్తే కండక్టర్లకు భారమైన చిల్లర సమస్యకు పరిష్కారం దొరకనుందన్నారు. ప్రయాణికులకు కూడా ప్రయాణం సులభతరం కానుందన్నారు.
ప్రస్తుతం కేఎస్ఆర్టీసీకి చెందిన 8వేల బస్సులు రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తున్నాయని క్యాష్‌లెస్ విధానంతో సంస్థకు నష్టాలు తప్పడమే కాక బస్సులు ప్రయాణించే మార్గాన్ని గుర్తించే వీలుంటుందన్నారు.

ఖద్దరంటే ఓ లీవీ..!



దర్పం ప్రదర్శిస్తున్న నాయకులు

ఎవరైనా ఖద్దరు డ్రస్ వేసి ఉంటే అతడు రాజకీయ నాయకుడని చెబుతారు. ఎందుకంటే ఆ ఖద్దర్ దుస్తులను గంజిపెట్టి, పాలిష్ చేయడంతో ధరించినవారిని నలుగురిలో ప్రత్యేకంగా నిలుపుతాయి. ఎన్నికల సమయంలో అయితే చిన్నా చితక కార్యకర్తలు సైతం ఖద్దర్‌ని ధరిస్తుంటారు. ప్రస్తుతం ఖద్దర్‌తో పాటు లెనిన్ దుస్తులను రాజకీయ నాయకులు అధికంగా ధరిస్తుంటారు. ఎన్నికల సమయంలో ఖద్దర్ దుస్తులు ధరించి నిగనిగలాడే బూట్లు, వీలైతే చేతికి బంగారు బ్రేస్‌లైట్, ఉంగరాలు, చేతిలో ఖరీదైన ఫోన్, బ్రాండెట్ కళ్లద్దాలతో కనిపిస్తారు. కొందరు నాయకులు కుదిరితే అందరి సమక్షంలో కారులోంచి దిగి దర్పం ప్రదర్శిస్తారు. ఇది అందరు నాయకులకు వర్తించనప్పటికీ కొందరు నాయకులు మాత్రం తగ్గరు. ఎన్నికలు ముగిసేవరకు అద్దెకార్లతో పనులు కానిస్తున్నారు. అయితే ఇవికూడా ఎందుకులే అనుకుంటున్న నాయకులు, కార్యకర్తలు మాత్రం ఖద్దర్ దుస్తులు కుట్టిస్తున్నారు. దీంతో వస్త్ర దుకాణాల్లో ఖద్దర్, లెనిన్ దుస్తుల విక్రయాలు పెరిగాయి. అదే సమయంలో టైలర్లకు కూడా గిరాకీ పెరిగింది. రెడీమెడ్ దుకాణాల్లో కూడా ఈ దుస్తుల విక్రయాలు పెరిగినట్లు పేర్కొంటున్నారు. గ్రామస్థాయి నాయకులు కూడా ప్రచారాలకు వెళ్లేటప్పుడు ఖద్దరు చొక్కాలను వేస్తూ దర్పం ప్రదర్శిస్తున్నారు. - హిందూపురం

పేదల నీటికి గండి..!

ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ మూసివేత

గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం పంచాయతీ కేంద్రాలలో ఎన్‌టీఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ పథకం ప్రవేశపెట్టింది. గ్రామీణ ప్రాంత ప్రజలు రెండు రూపాయలకే బిందె నీటిని ఈ ప్లాంట్ల నుంచి తెచ్చుకున్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ఈ వాటర్ ప్లాంట్‌లు మూతపడ్డాయి. మండలం లోని కళ్లహాళ, గోవిందవాడ, ఉప్పరహాళ్ తదితర పంచాయతీలలో సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్లను మూసివేశారు. ఉద్దేహాళ్ గ్రామంలో వైసీపీ ఆధీనంలోకి మినరల్‌వాటర్ ప్లాంటును తీసుకొని ఇతర గ్రామాలకు ఆటోల్లో తీసుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. - బొమ్మనహాళ్



మూతపడిన వాటర్ ప్లాంట్

ఒక్క ఓటు తేడాతో..



కదిరి అర్బన్, మే 2: నా ఒక్క ఓటు వేయకుంటే ఏమవుతుందిలే, అని చాలా మంది అనుకునేవారుంటారు. అయితే ఒక్క ఓటు తేడాతో ఎన్నికల్లో అభ్యర్థులు ఓడిపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. ముఖ్యమంత్రి పీఠాన్ని కోల్పోయిన నేతలున్నారు. ఒక్కఓటు ఎన్నో ఫలితాలను తారుమారు చేసిన సందర్భాలు అనేకం. సాధారణ ఎన్నికల నుంచి గ్రామ పంచాయతీకి నిర్వహించే ఎన్నికల వరకు అన్ని ఎంతో కీలకమైనవి.

- 2004 కర్ణాటకలోని సంతేమరహళ్లి నియోజకవర్గ నుంచి జేడీఎస్ నుంచి పోటీ చేసిన ఏఆర్ కృష్ణమూర్తి ఒక్క ఓటు తేడాలో ఎమ్మెల్యే సీటు కోల్పోయారు. ఎన్నికల రోజు ఓటు వేయాలనుకున్న తన డ్రైవర్‌కు ఏఆర్ కృష్ణమూర్తి సమయం ఇవ్వకపోవడంతో ఆయన ఓటు వేయలేకపోయినట్లు తరువాత కథనాలు వెలువడ్డాయి.

సీఎం చాన్స్ గల్లంతు

రాజస్థాన్‌లో 2008 శాసనసభ ఎన్నికల్లో నాత్‌ద్వారా అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున సీపీ జ్యోషి, బీజేపీనుంచి కళ్యాణ్‌సింగ్‌చౌహాన్ పోటీ చేశారు. ఫలితాల్లో ఒక్కఓటు తేడాతో చౌహాన్ గెలుపొందారు. జ్యోషి తల్లి, సోదరి, డ్రైవర్ ఎన్నికల రోజు ఓటు వేయడానికి వెళ్లలేదు. ఈ ముగ్గురు ఓటు వేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. ఎన్నికల్లో జ్యోషి రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడిగానే కాకుండా సీఎం రేసులో ముందున్నారు. పార్టీని విజయపథంలో నడిపించినా, ఒక్క ఓటుతో ఓడిపోవడంతో సీఎం అయ్యే అవకాశం కోల్పోయారు. వారి మూడు ఓట్లు పడి ఉంటే ఆయన ఎమ్మెల్యేగా గెలిచి సీఎం అయ్యేవారేమో. ఒక్క ఓటు విలువ ఎంతో చెప్పేందుకు ఇవే నిదర్శనం.

జగన్ మామ మోసం..!



విద్యార్థులకు రూ.300 కోట్లు బాకీ

ఉత్తుత్తి బటన్ నొక్కి విడుదల చేసినట్లు ప్రకటనలు

విద్యా, వసతి డబ్బుల కోసం ఎదురుచూపులు

నాలుగేళ్లలో ఇచ్చింది రెండేళ్లకే..

సొంతంగా ఫీజు కట్టుకుంటున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, మే 2 : 'మీ పిల్లలకు మేనమామగా నేనే చదివిస్తా.. ఫీజులు మొత్తం చెల్లిస్తా' అని బాకాలూదిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి.. తన పాలనలో విద్యార్థులకు సుమారు రూ.300 కోట్లు బాకీపడ్డారు. విద్యా, వసతి దీవెన పథకాల పేరుతో ఉత్తుత్తి బటన్లు నొక్కి ఏ ప్రభుత్వం చేయలేని మేలును తానే చేశానంటూ ప్రకటనలు చేశారు. గత ప్రభుత్వం చెల్లించిన ఫీజులను లెక్కలేసి అంతకంటే రెట్టింపు ఇచ్చానంటూ గొప్పలు చెప్పారు. తమ ప్రభుత్వమే విద్యార్థులను ఉచితంగా చదివిస్తూ ఫీజులు చెల్లిస్తుందని నమ్మించారు. వాస్తవానికి తమ కష్టార్జితంతో కళాశాలలకు ఫీజులు కట్టి పిల్లలను చదివిస్తున్నామని, జగన్ సొంతడబ్బా కొట్టుకున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం చెల్లించింది రెండేళ్లకు మాత్రమేనని.. అదీ ఆరోకరగా ఇచ్చి చేతులు దులుపుకుందని వాపోతున్నారు. 2023-24లో నొక్కిన బటన్లు ఏమైయ్యాయని.. ఆ డబ్బులు ఎక్కడికెళ్లాయని ప్రశ్నిస్తున్నారు.

ఉత్తుత్తి బటన్ నొక్కుడు..

జేఎన్‌టీయూ, ఎస్కేయూ పరిధిలో కన్వీనర్ కోటా ద్వారా దాదాపు 1.20 లక్షల మంది బీటెక్, 15వేల మంది బీఫార్మసీ, 50వేల మంది డిగ్రీ కోర్సులు అభ్యసిస్తున్నారు. 12వేల మంది పాలిటెక్నిక్ కోర్సులు చదువుతున్నారు. వీరందరూ విద్యాదీవెన, వసతి దీవెన పథకాల అర్హులు. బీటెక్, బీఫార్మసీ నాలుగు సంవత్సరాలు. డిగ్రీ, పాలిటెక్నిక్ కోర్సులు మూడేళ్ల చొప్పున చదవాలి. ప్రతి ఏటా ఫీజులు మొత్తాల చెల్లింపు పూర్తిచేస్తేగాని కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు రాయనీయవు. జగన్ మాత్రం సంవత్సరంలో నాలుగుసార్లు ఉత్తుత్తి బటన్ నొక్కుతున్నారని మండిపడుతున్నారు.

ఫీజు మొత్తాల్లోనూ వివక్ష..

గత టీడీపీ ప్రభుత్వం విద్యార్థులు చదువుతున్న కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను చెల్లించేది. విద్యార్థుల వివరాలను జోడించి వారి పేరుతో కళాశాల ఖాతాలకు జమచేసేది. బీటెక్, బీఫార్మసీ, డిగ్రీ, పాలిటెక్నిక్.. ఇలా కోర్సులను బట్టి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాన్ని కళాశాలలకు జమచేసేది. కళాశాలలపై కక్షకట్టిన జగన్.. ఒక్కో కళాశాలకు ఒక్కోవిధంగా ఫీజులు నిర్ణయించారు. బీటెక్‌లో.. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలకు రూ.43వేల నుంచి రూ.77వేల వరకు, యూనివర్సిటీ క్యాంపస్, కాన్‌స్టిట్యూయెంట్ కళాశాలలకు రూ.10వేల నుంచి రూ.37వేల వరకు, సెల్ఫ్ ఫైనాన్స్ కళాశాలలకు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు, ప్రైవేట్ యూనివర్సిటీలకు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు కన్వీనర్ కోటాకింద ఫీజులను నిర్ణయించారు. బీఫార్మసీలో.. ప్రైవేట్ కళాశాలలకు రూ.38వేల నుంచి రూ.65వేల వరకు, యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలకు రూ.10వేలు, సెల్ఫ్ ఫైనాన్స్ కళాశాలలకు రూ.35వేల నుంచి రూ.50వేలుగా చేశారు. డిగ్రీ కోర్సుల్లో.. ఆర్ట్స్‌కు రూ.4,175నుంచి రూ.11వేల వరకు, సైన్స్‌కు రూ.4,875నుంచి రూ.16వేల వరకు నిర్ణయించారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో.. ప్రభుత్వ కళాశాలలకు రూ.4,700, ప్రైవేట్ కళాశాలలకు రూ.25వేలుగా నిర్ణయించారు. కన్వీనర్ కోటాలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులను విద్యా దీవెన, వసతి

రూ. 300 కోట్ల ఎగనామం

దీవెన కింద దాదాపు రూ.300కోట్లు ఎగనామం పెట్టారని విద్యార్థులు, అధికార వర్గాలు మండిపడుతున్నాయి. 2023-24 విద్యాసంవత్సరం ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఒక్కపైసా చెల్లించలేదని వాపోతున్నారు. తాజాగా నొక్కిన బటన్ ద్వారా ఏ విద్యార్థి తల్లి ఖాతాలో కూడా నగదు జమకాలేదని మండిపడుతున్నారు. హాస్టల్‌లో వసతి పొందేందుకు సంవత్సరానికి రూ.20వేలు ఇస్తామంటూ ఎన్నికల్లో హామీనిచ్చి రూ.10వేలకు కుదించారని వాపోతున్నారు. అందులోనూ నాలుగేళ్లకు రెండు సంవత్సరాలు ఎగ్గొట్టారని చెబుతున్నారు. జగన్ తన సామాజికిక వర్గానికి చెందిన కళాశాలలకు ఫీజులు అధికంగా పెంచి ఆ భారాన్ని తమ మోపాడని మండిపడుతున్నారు. రాజకీయ పలుకుడి లేని కళాశాలల్లో బీటెక్ ఫీజు రూ.45వేలు అయితే ఆయన వర్గానికి చెందిన కళాశాలల్లో రూ.77వేలు నిర్ణయించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- వేమన, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు

అబద్ధపు మాటలతో పేదలను నమ్మించి మోసం చేయ

మోసానికి మారుపేరు జగన్

డం లో జగన్‌కు తిరుగులేదు. జేఎన్‌టీయూ, ఎస్కేయూలో పరిధిలో కన్వీనర్ కోటాకింద దాదాపు రెండు లక్షల మందికి విద్యాదీవెన, వసతి దీవెన డబ్బులు మంజూరు చేయాలి. నాలుగేళ్లలో రూ.300 కోట్లకు పైగా జగన్ బాకీపడ్డారు. వసతి దీవెన కింద ఏడాదికి రూ.20వేలు ప్రకటించి రూ.10వేలకు కుదించారు. అదికూడా ఇవ్వకుండా మోసం చేశారు.



సంవత్సరంలో నాలుగుసార్లు బటన్

కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

ఏడాదికి ఒకసారి చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సీఎం జగన్‌రెడ్డి నాలుగుసార్లు బటన్ నొక్కుతున్నాడు. డిగ్రీకి రూ.4వేలు, ఇంజనీరింగ్‌కు రూ.10వేలు ఇలా చిన్నచిన్న మొత్తాలను నాలుగు సార్లు విడుదల చేయడంతో వచ్చే వెయ్యి, రెండువేలు ఖర్చులకే సరిపోతుంది. కళాశాలలకు ఎప్పుడు కట్టాలి. నాలుగేళ్లలో రెండు సంవత్సరాలు మాత్రమే ఫీజులు చెల్లించి మిగిలిన డబ్బులు బాకీపడ్డారు. రూ.20వేల నుంచి రూ.70వేలు ఫీజులున్న కళాశాలలకు పేద విద్యార్థులు ఎలా చెల్లిస్తా రు?. జగన్ ఇంటికి పోయే సమయం దగ్గరపడటంతో చేతులెత్తేశాడు.

పనికెళ్లి ఫీజులు కడుతున్నా...



విద్యా దీవెన డబ్బులు రాకపోవడంతో ఊర్లో కూలిపనుకెళ్లి కళాశాల ఫీజులు కడుతున్నాను. చదువులు ఉచితమని ప్రభుత్వం చెబుతున్నా ఫీజులు ఇవ్వడంలేదు. సంవత్సరంలో రెండు సెమిస్టర్ పరీక్షలు రాయాలి. ఫీజులు కట్టకుంటే పరీక్షలు రాయనీయరు. వసతి దీవెన రూ.10వేలు కూడా రాలేదు. నాలాంటి చాలామంది పేద విద్యార్థులు డిగ్రీ చదువుతున్నా సెలవు రోజుల్లో కూలి పనులకెళ్లి ఫీజులు కట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా స్పందించి ఫీజు మొత్తాలను విడుదలచేయాలి.

- జయలక్ష్మి, డిగ్రీ విద్యార్థిని

విద్యా, వసతి దీవెనలు అందలేదు



ప్రభుత్వం చెల్లిస్తామన్న విద్యా, వసతి దీవెన డబ్బులు అందలేదు. సీఎం జగన్.. బటన్ నొక్కుతూనే తల్లుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పినా నేటికీ రాలేదు. దీంతో అమ్మ, నాన్న కూలి పనుకెళ్లి వచ్చిన డబ్బులతో ఫీజులు కడుతున్నాం. డిగ్రీ పూర్తిచేసి బీఈడీ చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. డీఎస్సీ నోటిఫికేషన్ వస్తే టీచర్ పోస్టు సంపాదించవచ్చు. డిగ్రీ చదవాలంటేనే ప్రభుత్వం ఫీజులు ఇవ్వడంలేదు. ఇలాగైతే బీఈడీ ఎప్పుడు పూర్తిచేయాలి. టీచర్ పోస్టు ఎలా సాధించాలి.

-సాఫ్రియా, డిగ్రీ విద్యార్థిని



మెళవాయిలో పునాదులకే పరిమితమైన సచివాలయ భవన నిర్మాణం

ఏళ్లు గడిచినా... అంతేనా ?

నేటికీ పూర్తికాని సచివాలయ భవన నిర్మాణాలు



ఆమిదాలగొందిలో ఆగిపోయిన భవన నిర్మాణం

మండలంలో 18 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు పూర్తి కాలేదు. ఇంకా కొన్ని పునాదుల దశలోనే ఉన్నాయి. గ్రామ సచివాలయాలకు సంబంధించి పక్కా భవనాల కోసం రూ.8.10 కోట్లతో పనులు చేపట్టారు. ఒక్కో సచివాలయ భవనానికి రూ.45 లక్షలు విడుదల చేశారు. మొదటి విడతలో నిధులు బాగా విడుదల కావడంతో పనులు ఎంతో ఉత్సాహంగా చేపట్టారు. రెండో విడుతకు నిధులు విడుదల కాకపోవడంతో చాల భవనాలు లింటిల్, టాప్‌లెవల్ వరకు వచ్చి నిలిచిపోయాయి. మెళవాయి గ్రామ సచివాలయం పునాదులకై పరిమితమైంది. నిధుల కొరతతో ఏళ్లు గడుస్తున్నా భవన నిర్మాణాలు పూర్తి కాలేదు. అందుకే సచివాలయాల నిర్వహణ గ్రామాల్లో కమ్యూనిటీ భవనాలు, మహిళా సంఘాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఒక్క భవనం కూడా పూర్తి కాలేదు.

- మడకశిర రూరల్

కేతిరెడ్డి సారు చెప్పారు.. ప్రచారానికి రండి..!

సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు వైసీపీ కౌన్సిలర్ హుకుం

ధర్మవరం, మే 2: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా ప్రచారానికి రావాలని అధికార పార్టీకి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేశ్ ఆదేశించిన వాయిస్ మెసేజ్ వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తోంది. 'ఎమ్మెల్యే కేతిరెడ్డి సార్ చెప్పారు.. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎన్నికల ప్రచారానికి ఉదయం 6గంటలకంత లక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న మన కాంప్లెక్స్ వద్దకు రావాలి..' అని వాట్సాప్ ద్వారా పంపిన మెసేజ్ అన్ని గ్రూపుల్లో వైరల్‌గా మారింది.

ఊరుకిచ్చిన మాట గుర్తుందా..?

అనంతపురం రూరల్

అప్పుడెప్పుడో ఎన్నికల ప్రచారానికి మా ఊరికొచ్చావ్. ఎన్నో హామీలిచ్చావ్. గెలిస్తే గ్రామానికి వచ్చి వెళ్లే ప్రధాన రోడ్డు వేస్తానన్నావ్. గ్రామానికి రోడ్లు, కాలువలు, నీళ్లు ఇస్తానన్నావ్. నిజంగా పనులన్నీ చేస్తావేమోనని మేమంతా సంబరపడ్డాం. పోలింగ్ రోజు ఎగబడి ఓట్లు వేశాం. గెలిచావ్. ఆనక కనిపించకుండా పోయావ్. ఎమ్మెల్యేగారు..! అసలు మా ఊరంటూ ఒకటి ఉందని గుర్తుందా? అని ఆ ఊరి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇదెక్కడి పాలనో? ఈయనేమీ పాలకుడో అంటూ ఈసడించుకుంటున్నారు. ఇదీ రాప్తాడు నియోజకవర్గం అనంతపురం రూరల్ మండలం, ఆలమూరు పంచాయతీ పరిధిలోని ఎం.బీ.పల్లి గ్రామస్థుల ఆవేదన. గ్రామం ఏమైనా మారుమూల ప్రాంతంలో ఉందా అంటే అదీ కాదు.

హామీలు మరచిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఎంబీపల్లికి ఐదేళ్లలో పైసా ఖర్చుచేయని దుస్థితి

అనంతపురం-ఆలమూరు రోడ్డు నుంచి గ్రామానికి 4.5కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. టీడీపీ హయాంలో దాదాపు రూ.1.9కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రోడ్డు వేసేందుకు మట్టి పనులు పూర్తి అయ్యాయి. ఊళ్లో నుంచి అర్ధబాగం చిన్న సైజు కంకర కూడా వేశారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో పాలకులు రోడ్డు సమస్యతో పాటు గ్రామంలోని సమస్యలు అలానే వదిలేశారు. ఐదేళ్ల కాలంలో పాల కులు గ్రామానికి వెళ్లింది కానీ స్థానిక సమస్యలు చర్చించి..వాటి పరిష్కారానికి ఒక్క పైసా ఖర్చు చేసిన దాఖలు లేవని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో రోడ్లు, కాలువలు లేక మురుగు నీరు రోడ్డుపైనే పారుతోంది. ఏడాది కిందట కురిసిన వర్షాలకు ప్రధాన రోడ్డు గుంతలు జలమయమైపోయాయి. దీంతో గ్రామస్థులే గుంతలు పూడ్చుకున్నారు. అయినా రోడ్డు నిర్మాణం జరగలేదు. స్థానిక ప్రజాప్రతినిధి తరచూ తన సొంత గ్రామానికి ఆలమూరు ప్రధాన రోడ్డుపైనే ప్రయాణం సాగిస్తున్నారు. అప్పుడైనా మా గ్రామానికి ఇచ్చిన మాటలు ఆయనకు గుర్తుకురాకపోవడం తాము చేసుకున్న పాపమని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కంకరతేలిన ఎంబీ పల్లి రోడ్డు

అయినా అభివృద్ధిని మాత్రం పాలకులు విస్మరించారు. గ్రామంలో ఐదేళ్ల కాలంలో ఒక్క పైసా ఖర్చు చేయలేదంటే అభివృద్ధి ఏమేరకు జరిగిందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న మండలంలోని సమస్యలే ఇలా పరిష్కరిస్తున్నారంటే ఇక దూరంగా ఉన్న ప్రాంతాల్లోనే సమస్యలు ఎలా రూపుమాపుతున్నారో ఆ పాలకులకే తెలియాలి.

సమస్యలు పట్టించుకునేదెవరు ?

గ్రామంలో ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీలున్నాయి. దాదాపు 80 కుటుంబాలు నివాసముంటున్నాయి. గ్రామం చిన్నదే అయినా సమస్యలను పరిష్కరించే నాథుడే లేడు. గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడం ప్రధాన సమస్య.



ఎస్సీ కాలనీలో ఇళ్ల మధ్య పారుతున్న మురుగు కాలువ

టీడీపీ హయాంలోనే అభివృద్ధి



గ్రామంలో ఈ ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చూసిందే లేదు. అంతో ఇంతో అభివృద్ధి జరిగిందంటే అది టీడీపీ హయాంలోనే జరిగింది. అప్పట్లో కొంత వరకు సీసీరోడ్ల నిర్మాణం జరిగింది. గ్రామానికి వచ్చే ప్రధాన రోడ్డు కూడా ప్రారంభమైంది. అయి తే ఎన్నికలు రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

- వీరాంజనేయులు, ఎంబీపల్లి

ఇబ్బందుల ప్రయాణం



గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. రోడ్డు మొత్తం గుంతలు పడింది. కంకర తేలింది. దీంతో ఆలమూరు రోడ్డు-అనంతపురం ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి ప్రయాణం చేయాలంటే అరగంట పడుతోంది. పాలకులు వచ్చి హామీలు ఇవ్వడమే తప్పా.. రోడ్డు నిర్మాణం చేసింది లేదు. మా సమస్య తీరింది లేదు.

- బాలకృష్ణ ఎంబీపల్లి

అలా ఇచ్చి... ఇలా దోపిడీ

ధర్మవరం

ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో ఆటోవాలాలకు ఆర్థిక కష్టాలు తప్పడంలేదు. ఏదో ఆదుకుంటాడనుకుంటే ఉన్నది లాగేసుకుంటున్నాడని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గోరంత సాయం చేసి కొండంత లాక్కోవడంపై ఆటో వర్గాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదికి ఆటో కార్మికులకు రూ.10వేలు ఆర్థిక సాయం చేసినట్లు చేసి అంతే స్థాయిలో వారి నుంచి వివిధ రూపాల కింద రెట్టింపు వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. జిల్లాలో 30వేలకు పైగా ఆటోలు ఉండగా అందులో సగం మందికి కూడా ఆర్థిక సాయం అందడం లేదు. జరిమానాలు, రోడ్డు టాక్స్ సీఎస్‌జీ రూపంలో వసూలు చేస్తూ ఆటో కార్మికుల నడ్డి విరుస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో రూ.130 జరిమానా విధిస్తే జగన్‌రెడ్డి రూ.1030 జరిమానా పెంచడంపై మండిపడుతున్నారు. ఏడాదిలో 10-15 సార్లు పని కట్టుకుని జరిమానాలు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. అదే విధంగా రోడ్డు టాక్స్ సీఎన్‌జీ వంటి టాక్స్‌లు కూడా భారీగా పెంచడంపై ఆటో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి సంపాదించిన సొమ్మంతా జరిమానాలకే సరిపోతోందని, ఇక తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వాపోతున్నారు.



ఆటో డ్రైవర్లకు ఆర్థిక కష్టాలు

వాహన మిత్రతో ఒరిగింది శూన్యం

ఏటా ఇచ్చేది రూ.10వేలు

జరిమానాలు, సీఎన్‌జీ, పన్నుల పేరుతో రెట్టింపు వసూలు

జగన్ సర్కారుకు తగిన సమయంలో తగిన మూల్యం చెల్లిస్తామని ఆటో కార్మికులు బాహాటంగా చెబుతున్నారు.

జరిమానాల దోపిడీ ఇలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిమానాలు చాలా తక్కువగా ఉండేవి. వైసీపీ వచ్చాక జరిమానాలు భారీగా పెరిగాయి. టీడీపీ హయాంలో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.130 జరిమాన విధించేవారు. వైసీపీ వచ్చాక జరిమానా కనిష్ట ధర రూ.1030 అయింది. ఏకంగా పది రెట్లు పెరిగిందన్న మాట. ఏడాదికి 10 నుంచి 15 వరకూ జరిమానాలు విధిస్తున్నారు. ఒక్కో ఆటోవాలా నుంచి ప్రభుత్వం జరిమానాల రూపంలో దాదాపు రూ.10వేల వరకు లాగేస్తోంది. పైగా గతంలో మాదిరిగా ట్రాఫిక్ డ్రైవ్స్ లేవు. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి చలానాలు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. తప్పు చేయకపోయినా ఫొటో చూపి ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా పేర్కొంటున్నారు. ఈ భారమంతా ఆటోవాలాలపై ఒకేసారి పడుతోంది.

పన్నులు, పర్మిట్లతో గుంజుడే గుంజుడు

ఆటోవాలాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల పెంపు, పర్మిట్ల భారాన్ని మోపింది. ఇన్సూరెన్స్ ఫీజులను తగ్గించమని ఆటోవాలాలు మొత్తుకున్నా వినలేదు. పన్నును అమాంతంగా పెంచేశారు. పదిహేనేళ్ల కాల పరిమితి దాటిన వాహనాలకు విధించే ఈ పన్ను భారాన్ని తగ్గించాలని ఆటోవాలాలు కోరినా వినలేదు. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటోవాలాల నెత్తిన గుదిబండను మోపింది జగన్ ప్రభుత్వం. ఇలా సగటున ఒక్కో ఆటోవాలకు ఏడాదికి రూ.10వేలకు పైగానే అదనపు భారం పడుతోంది.

సీఎన్‌జీ బాదుడు మరోలా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ) ధర రూ.55గా ఉంది. ప్రస్తుతం రూ.85కు చేరింది. ఏటా రూ.5,రూ.10,రూ.15 మేర పెరుగుతూ వస్తోంది. డీజిల్ ధరలకు అత్యంత దగ్గరగా సీఎన్‌జీ ధర చేరింది. పెట్రోల్, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీని ఉపయోగించి నాలుగు డబ్బులు వెనుకేసుకుందాం అనుకునే ఆటోవాలాలకు భారంగానే మారింది. రోజూ సగటున 200 నుంచి 250కిలోమీటర్ల వరకు నడుపుతారు. ఇందుకు 6 కిలోల సీఎన్‌జీ అవసరం. పెరిగిన సీఎన్‌జీ భారం రూ.30తో రోజుకు రూ.180 చొప్పున నెలకు రూ.5400 అదనపు భారం పడుతోంది. ఏడాదికి రూ.64,800 భారమవుతోంది. సీఎన్‌జీపై రాష్ట్ర ప్రభుత్వం కిలోమీటరుకు రూపాయి చొప్పున రోడ్డు సెస్సు వసూలు చేస్తోంది. ఈ ప్రకారం ఒక్కో ఆటో వాలా నుంచి ఏడాదికి రూ.2160 అదనంగా తీసుకుంటోంది.

ఆటోలను అమ్ముకోవాల్సిందే



గత టీడీపీ హయాంలో జరిమానాలు తక్కువగా ఉండేవి. రోజంతా కష్టపడితే కనీసం రూ.500 మిగిలేది. నాకు రెండు ఆటోలుండేవి. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిమానాలు, ఇతర పన్నులు పెరగడం వల్ల ఒక ఆటో అమ్మేశాను. పైగా రోజంతా ఆటో నడిపితే ఏమాత్రం మిగిలలేని పరిస్థితి.

రాజేశ్, ఒలిమిచెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం

వైసీపీ ప్రభుత్వంలో ఒరిగిందేమీ లేదు



ఆటో డ్రైవర్లకు వైసీపీ ప్రభుత్వంలో ఒరిగిందేమీలేదు. వాహన మిత్ర కింద రూ.10వేలు ఏడాదికి ఇస్తున్నమాట వాస్తవమే. ఆ రూ.10వేలు జరిమానాల రూపంలో లాగేసుకుంటున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు తనిఖీలు చేయడం జరిమానాలు విధిస్తున్నారు. కుటుంబ పోషణ భారమైంది.

- రవి, కోడేకండ్ల, బత్తలపల్లి మండలం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

వీకే కృష్ణ మీనన్ (జయంతి)



వెంగలీల్ కృష్ణ కురుప్ కృష్ణమీనన్ 1896 మే 3న కేరళ రాష్ట్రం థలస్సేరి ప్రాంతంలో జన్మించారు. జాతీయవాది, దౌత్య వేత్త, రాజకీయ నాయకుడు. దేశ తొలిప్రధాని నెహ్రూకు అత్యంత ఆప్తుడిగా పేరొందారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రిగాను, ఇతర హోదాలలోనూ కొన సాగారు. కెరీర్ ప్రారంభంలో పెంగ్విన్‌బుక్స్ సంస్థకు సంపాదకుడిగా పనిచేశారు. ఇతర దేశాల్లో భారత స్వాతంత్రోద్యమానికి ప్రాచుర్యం కల్పించారు. లండన్‌లో ఇండియా లీగ్‌ను స్థాపించి ఆ దేశంనుంచి మద్దతు రాబట్టగలిగారు. పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1974 అక్టోబరు 6న కన్నుమూశారు. 1997లో ఆయన జ్ఞాపకార్థం తపాలా బిళ్ల విడుదల చేశారు.

బింగ్ క్రాస్బీ (జయంతి)



హ్యారీ లిల్లిస్ క్రాస్బీ 1903 మే 3న యునైటెడ్ స్టేట్స్ టకోమా ప్రాంతంలో జన్మించారు. అమెరికన్ గాయకుడు, కమెడియన్, నటుడు. 20వ శతబ్దాంలో అత్యధికంగా అమ్ముడైన, అత్యంత విజయవంతమైన సంగీతకారుడు, తొలి మల్టీమీడియా కళాకారులలో ఒకరు. ఒక బిలియన్ రికార్డులు ఇంతవరకు అమ్ముడయ్యాయి. 41 నెంబరువన్ హిట్‌లు సహా 396 వ్యక్తిగత రికార్డులు కలిగి ఉన్నారు. 'వైట్ క్రిస్మస్' ఎంతో గుర్తింపు తెచ్చింది. రేడియోలలోనూ ప్రసారమైంది. గ్రామీ గ్లోబల్ అచీవ్‌మెంట్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 1977 అక్టోబరు 14న కన్నుమూశారు.

నర్గిస్ (వర్ధంతి)



ప్రముఖ నటి నర్గిస్ 1929 జూన్ 1న కోల్కత్తాలో జన్మించారు. ఆమె అసలు పేరు ఫాతిమా రషీద్. 40, 60 దశకాల మధ్య వెండితెరపై రాణించారు. విమర్శకుల ప్రశంసలు సైతం అందుకున్నారు. 'మదర్ ఇండియా' సినిమాతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. అకాడమీ అవార్డుకు నామినేట్ అయ్యింది. బర్సాత్, అందాజ్, ఆవారా, చోరీచోరీ, రాత్ ఔర్ దిన్ తదతర సినిమాలు ఎంతో పేరొందాయి. ఫిలింఫేర్ ఉత్తమనటి అవార్డు, జాతీయ ఉత్తమనటి, పద్మశ్రీ తదితర అవార్డులు పొందారు. 1981 మే 3న కన్నుమూశారు. ఆమె జ్ఞాపకార్థం ఏటా నర్గీస్‌దత్ అవార్డు ఇస్తున్నారు.

ఆరోగ్యశాఖ క్వార్టర్స్ అధ్వానం



దుస్థితిలో ఉన్న ఇళ్లు ఇలా...

బాగేపల్లి, మే 2: పట్టణంలోని 16వ వార్డులో ఆరోగ్యశాఖ సిబ్బందికోసం వసతి సముదాయం నిర్మించి నాలుగైదు దశాబ్దాలైంది. ఆరంభంలో ఉత్తమ నిర్వహణ ఉండేది. కాలానుగుణంగా పట్టించుకోకపోవడంతో క్వార్టర్స్‌లోని గదులు దెబ్బతిన్నాయి. శుభ్రత కరువైంది. మౌలిక సదుపాయాల కొరత కారణంగా సిబ్బంది ఇక్కడ నివసించడానికి ఆసక్తి చూపలేదు. బాడుగ ఇళ్లల్లో ఉండేవారు. కొన్ని నెలలుగా క్వార్టర్స్‌లో నివసించేవారు లేకపోవడంతో తలుపులు, కిటికీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. క్వార్టర్స్ ముందుభాగం పిచ్చిమొక్కలతో నిండింది. క్వార్టర్స్‌లో మొత్తం 8 ఇళ్లు ఉండగా ఒకటో రెండో కొంతమేర నివాసయోగంగా ఉన్నప్పటికీ చుట్టుపక్కల ఇతర ఇళ్ల నిర్వహణ కొరత కారణంగా దోమలు, పాముల బెడదతో ఇక్కడ ఉండేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

పాడుబడిన వసతి సముదాయం

వసతి గృహాల సముదాయం పాతది కావడంతో పూర్తిగా తొలగించి నూతనంగా నిర్మించేందుకు గ్రాంటు మంజూరైంది. అయితే ఆ మొత్తంతో సమగ్ర నిర్మాణం సాధ్యం కాదని, మరింత గ్రాంటు అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు. ఇందుకు సంబంధించి ఆరోగ్యశాఖకు ప్రస్తావన సమర్పించామని తాలూకా వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న వసతిగృహాలో ప్రభుత్వ ఆసుపత్రికి సమీపంలో ఉన్నప్పటికీ నివాసానికి యోగ్యమైనవి అందులో తక్కువగా ఉండడం, చాలావరకు పాడబడ్డంతో సాధ్యమైనంత త్వరగా నూతన క్వార్టర్స్ నిర్మిస్తే అనుకూలం కాగలదని పలువురు సిబ్బంది అభిప్రాయపడ్డారు.

బెంగళూరులో ఏసీ, కూలర్లకు భారీ డిమాండ్



బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎండలు మండిపోతుండడంతో ఏసీలు, కూలర్‌లకు డిమాండ్ పెరిగింది. బెంగళూరులో ఎండాకాలంలోనూ 30-35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యేది. అదే అత్యధికంగా భావించేవారు. ఈ ఏడాది 40 డిగ్రీల గరిష్టాన్ని దాటిపోవడంతోపాటు వేడి గాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉక్కపోతను భరించలేకపోతున్నారు. ఫ్యాన్ లేదంటే ఐదు నిమిషాలు కూడా గడిపే పరిస్థితి కూడా లేనంతగా మారింది. నగరంలో ఉక్కపోతలు భరించలేని ప్రజలు బయటకు వస్తే చాలు కొబ్బరి నీరు, పండ్ల రసాలకోసం ఎగబడుతున్నారు. ఫ్యాన్ గాలి ప్రభావం అంతంత మాత్రమే అనిపిస్తుండడంతో ఎయిర్‌కూలర్, ఏసీలకు నగరవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. పలు చోట్ల ఉన్న స్టాక్ ముగిసిపోవడంతో ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్‌లు పెరిగినట్టు తెలుస్తోంది. ఆన్‌లైన్‌లో బుక్ చేసినా రెండు మూడు వారాల గడువు అవసరమని సమాచారం వస్తోంది. రాజాజినగర్‌లోని ఓ అప్లయెన్సెస్‌లో ఒకే రోజున 50 ఏసీలు అమ్ముడు పోయినట్టు సమాచారం. ఇదే పరిస్థితి నగర వ్యాప్తంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాలలో ఏసీలు, కూలర్‌లకు డిమాండ్ పెరిగింది.

రాష్ట్ర గౌరవాన్ని మట్టిపాలు చేశారు



మీడియాతో కాంగ్రెస్ మైనారిటీ విభాగం నాయకులు

బంగారపేట, మే 2: ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వివాదం మహిళలను అవమానించేలా ఉందని రాష్ట్ర గౌరవాన్ని మాజీ ప్రధాని దేవేగౌడ కుటుంబీకులు మట్టిపాలు చేశారని కాంగ్రెస్ రాష్ట్ర మైనారిటీ విభాగం ఉపాధ్యక్షుడు స్టాండ్‌లి మండిపడ్డారు. పట్టణంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రజ్వల్ తప్పు చేశాడు కనుకనే విదేశాలకు పారిపోయాడన్నారు. బాధిత మహిళలకు న్యాయం లభించేవరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కామపిశాచి ప్రజ్వల్ రేవణ్ణకు కఠినశిక్ష పడాలని డిమాండ్ చేశారు. మహిళలపై లైంగిక దౌర్జన్యాలకు పాల్పడిన ఘటనపై బీజేపీ వారు ఎందుకు నోరు మెదపలేదని ప్రశ్నించారు. విద్యార్థిని నేహా మృతిపై నాయకులంతా వీధి పోరాటం చేయగా ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదన్నారు. ఈ ఘోర ఘటనను సీబీఐకు అప్పగించాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో తాలూకా మైనారిటీల విభాగం అధ్యక్షుడు సయ్యద్ గౌస్, తాలూకా బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి రఫీక్, ప్రముఖులు అజామ్ షరీఫ్, అజామత్ ఉల్లాఖాన్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ఇష్యూలోకి ఇండిజీన్

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్రధాన కార్యాలయంగా ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాలు సాగించే ఇండిజీన్ కంపెనీ పెట్టుబడుల సాధనకోసం పబ్లిక్ ఇష్యూలోకి వెళ్లింది. ఈనెల 6న ఆఫర్ ఆరంభం కానుండగా 8వ తేదీతో ముగింపు ఉన్నట్టు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. బెంగళూరులో ఐపీఓకు సంబంధించి వివరాలను వెల్లడించారు. ప్రైజ్‌బాండ్ రూ.430, ఈక్విటీ షేర్ రూ.452గా ఉందని ఫేస్ వాల్యూ రూ.2గా ఉందన్నారు. కనీసం 33 ఈక్విటీ షేర్స్‌ను కొనుగోళ్లకు అవకాశం కల్పించారు. పలు ప్రముఖ కంపెనీలకు ఇండిజీన్ సేవలందిస్తోంది. ఇండిజీన్ సంస్థ పరిశోధనలు, హెల్త్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల విభాగంలో ప్రగతి దశలో కొనసాగుతున్న సంస్థ. ప్రపంచ వ్యాప్తంగా 17శాఖలు ఉన్నట్టు ప్రకటనలో తెలిపారు.

జేఈఈ టాపర్‌లకు అభినందన



టాపర్లతో ఆకాష్ విద్యా సంస్థ ప్రముఖులు

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో కర్ణాటక టాపర్‌గా సాన్విజైన్ నిలిచారు. జాతీయస్థాయిలో 34వ ర్యాంకును సాధించారు. కృష్ణ సాయి శిశిర్ వీ ఉప్పల 72వ ర్యాంకును సాధించారు. వీరు ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అకాడమీలో తర్ఫీదు పొందారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం ఆకాష్ క్యాంపస్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ఆకాష్ చీఫ్ అకడమిక్ బిజినెస్ హెడ్ ధీరజ్ మిశ్రా మాట్లాడుతూ విద్యార్థులు జేఈఈ ఎంట్రెన్స్‌తోపాటు మెయిన్స్‌లోనూ ప్రతిభ చాటారన్నారు. ఇద్దరు బెంగళూరుకు చెందిన విద్యార్థులని, సాన్విజైన్ భౌతికశాస్త్రం, గణితంలో 100 శాతం మార్కులు, కృష్ణసాయి రసాయనశాస్త్రం, గణితంలో 100శాతం మార్కులు సాధించారన్నారు.

బస్సులు లేక తప్పని తిప్పలు



రోడ్డుపక్కన వేచియున్న ప్రయాణీకులు

శిడ్లఘట్ట, మే 2: శిడ్లఘట్ట నుంచి హెచ్‌క్రాస్ మార్గంలో బేటరాయస్వామి దేవాలయం వరకు, ఇతర దూర ప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శిడ్ల ఘట్ట నుంచి హెచ్‌క్రాస్ మార్గంలో ఆనూరు, చిక్కదాసరహళ్ళి, బేటరాయ స్వామి దేవాలయం, నారాయణ దాసరహళ్ళి, చీమంగల, హెణ్ణూరు, కేజి పుర, హేమారలహళ్ళిలకు వెళ్లే ఈ మార్గంలో బస్సు సంచారం లేదు. ఇతర ప్రైవేట్ బస్సులు కూడా కలెక్షన్ లేవంటూ ఎప్పుడైనా ఒక సర్వీస్ నడిపితే నడుపుతారు లేదంటే అంతే సంగతులు. కూలి పనులకు వెళ్లేవారు, విద్యార్థులు తదితరులు బస్సు సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. శిడ్లఘట్ట నుంచి ఆనూరు, జత్తి, హోసళ్లి తదితర ప్రాం తాలకు ఆటోలలో వెళ్లేందుకు రూ.30-50 వరకు చార్జ్ అవుతుంది. చిక్కబళ్ళాపుర మార్గంలో వేచి ఉండాలంటే కనీసం బస్ షెల్టర్ లేకపోవడంతో ఇబ్బం దిగా ఉందని ప్రయాణీకులు వాపోతున్నారు. ఇలా రాకపోకలకు వంద రూపాయల దాకా ఖర్చు కానుంది. కేఎస్‌ఆర్టీసీ డిపో ఏర్పాటయ్యాక తాలూకాలోని అన్ని మార్గాలకు బస్సు సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చినా ఆ మేరకు అమలు కావడం లేదని గ్రామస్థులు ఆక్రోశం వ్యక్తం చేస్తు న్నారు. కోలారు జిల్లాకు వెళ్లాలంటే చీమంగళ, హెచ్‌క్రాస్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. ఇంతటి మార్గానికి బస్సులు లేకుంటే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే రవికుమార్ మరింత చొరవ చూపి బస్సు సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. కేఎస్‌ఆర్టీసీ బస్సులు అందుబాటులోకి వస్తే విద్యార్థులు, ఉపాధ్యా యులు, ఇతరత్రా వర్గాల ప్రజలకు ఎంతో వెసలుబాటు కానుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జలమండలి నుంచి విప్రోకు రోజూ 3 లక్షల లీటర్ల నీటి సరఫరా

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జలమండలి నుంచి విప్రో సంస్థకు రోజూ 3 లక్షల లీటర్ల సంస్కరించబడిన జీరో బ్యాక్టీరియా నీటిని సమకూరుస్తున్నారు. సంస్కరించిన నీటిని పలు విధాలుగా ఉపయోగించుకుంటున్నట్టు విప్రో సంస్థ ప్రకటించింది. సంస్కరించబడిన నీటిని ప్రోత్సహించే దిశగా ఐటీ కంపెనీలు ముందుకొచ్చాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ శాస్త్రవేత్తలు దేశీయ పరిజ్ఞానంతో జలమండలి నుంచి వృథా నీటిని జీరో బ్యాక్టీరియా స్థాయిలో సంస్కరిస్తున్నారు. విప్రో సెజ్‌లోని కొడతిలోని సంస్థకు సంస్కరించబడిన నీటిని అందిస్తున్నామని జలమండలి చైర్మన్ రాం ప్రసాత్ మనోహర్ వెల్లడిం చారు. గురువారం ఆయన మీడియా తో మాట్లాడుతూ బెంగళూరు నగర భవిష్యత్తు అవసరాలకోసం సంస్కరించ బడిన నీటిని పలు విధా లుగా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. జలమండలి ద్వారా నగరంలో 34కుపైగా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు ప్రారంభించామన్నారు. వీటి ద్వారా 1200 ఎంఎల్‌డీల నీటిని శుద్ధీకరణ చేస్తున్నా మన్నారు. రెండు నెలలుగా ఐటీ కంపెనీలకు సరఫరా చేస్తున్నామన్నారు. 60వేల లీటర్లనుంచి 6 ఎంఎల్‌డీలకు చేరింది. భవిష్యత్తులో మరింత ఎక్కువ సాధన లక్ష్యమన్నారు.

సంబరంగా కరగ ఉత్సవం



కరగ ఊరేగింపులో పాల్గొన్న మహిళాబృందం

శిడ్లఘట్ట, మే 2: శిడ్లఘట్ట తాలూకాలోని మేలూరులో ధర్మరాయస్వామి ద్రౌపదమ్మదేవి ఆలయ 36వ వార్షిక కరగ మహోత్సవం ముగింపు గురువారం సంబరంగా సాగింది. కృష్ణమూర్తి, రేఖా దంపతుల కుమారుడు 11ఏళ్ల ప్రజ్వల్ కరగను ధరించి భక్తితో ముందుకు సాగడం విశేషంగా అలరించింది. ప్రత్యేకించి చెంగల్ రాయరెడ్డి సర్కిల్‌లో కరగతో చేసిన నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఈ ఏడాది చక్కటి వర్షాలు కురవాలని భక్తులు పూజలు చేశారు.

పొలాల రోడ్డు ఆక్రమణపై నిరసన



తాలూకా కార్యాలయం వద్ద రైతుసంఘం నిరసన

బాగేపల్లి, మే 2: యల్లంపల్లి గ్రామంలో పొలాలకు వెళ్లే మార్గాన్ని ఒక వ్యక్తి ఆక్రమిం మూసివేయడంపై రాష్ట్ర రైతుసంఘం, హసిరు సేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గురువారం సంఘం తాలూకా అధ్యక్షుడు గోవిందరెడ్డి నేతృత్వంలో తాలూకా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్‌కు వినతి పత్రం సమర్పించారు. వారం రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ సర్వే 144లో 9 ఎకరాల 13 గుంటల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. ఈ భూమి వెనుక ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన సుమారు 15 రైతు కుటుంబాలు ఉన్నాయన్నారు. పశువులు మేపేందుకు, పంటలను తరలించేందుకు ప్రభుత్వ భూమిలో బాట వేసుకున్నారన్నారు. అయితే ఈశ్వరప్ప అనే వ్యక్తి సర్వే 144లో పొక్లైనర్ ద్వారా మట్టి వేసి దారిని మూసివేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. తహసీల్దార్ హామీతో నిరసన వీడారు. నిరసనలో రాష్ట్ర రైతుసంఘం గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, రైతులు ఆనంద్, నరేంద్ర, నరసింహప్ప, మనోహర, జీ గంగరాజు, గజేంద్ర, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తికారుల ఘనత పెంచిన బసవణ్ణ




కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమంతటా ఒకే రోజున ఒక సందర్భాన్ని గుర్తుంచుకుని జరుపుకొనే వేడుక మే డే వెనుక శతాబ్దాల పోరాటం ఉందని, ఎంతోమంది ప్రాణాలర్పించారని కన్నడ అధ్యా పకులు రుద్రేశ్ అదరంగి అభిప్రాయపడ్డారు. అఖిలభారత శరణసాహిత్య పరిషత్ అధ్యక్షులు డాక్టర్ సీ సోమశేఖర్ అధ్యక్షత వహించగా కార్యదర్శి సోమశేఖర్ గాంజి, ట్రస్టీ దాని భారతి పాటిల్, బసవనగుడి నేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైసీ కమల, గీతా జయంత్‌లు మే డే వేడుకల్లో పాల్గొన్నారు. ప్రధాన ప్రసంగంలో రుద్రేశ్ అదరంగి మాట్లాడుతూ 12వ శతాబ్దంలోనే ప్రతి వృత్తికారుడికి గౌరవాన్ని ఘనతను బసవణ్ణ పెంచారన్నారు. ఆ తర్వాత ఆధునిక యుగంలో కార్మికుడి కష్టాలు, వేతనాలు, సెలవులు, సౌలభ్యాలకోసం విశ్వవ్యాప్తంగా పోరాటం చేశారన్నారు. వృత్తికారులకు బసవణ్ణ గౌరవం ఇచ్చారన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్త తప్పనిసరి

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు ముఖ్యమని రెయిన్‌బో ఆసుపత్రి వైస్‌ప్రెసిడెంట్ నిత్యానంద తెలిపారు. హెణ్ణూరులో ఇటీవల కొత్త శాఖను ఆరంభించినట్టు ప్రక టించారు. ఈమేరకు గురువారం రెయిన్‌బో ఆసుపత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. బెంగళూరులో తల్లీబిడ్డల ఆరోగ్య సేవలు మెరుగుపరచాలనే ప్రాంతాలవారీగా ఆధునాతన శాఖలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హెణ్ణూరులో శాఖ ఏర్పాటు ద్వారా నాలుగు బ్రాంచ్‌లు అయ్యాయన్నారు. ప్రధానంగా చిన్నపిల్లల వైద్యం, గైనకాలజీ, ఫెర్టిలిటీ స్పెషాలిటీ, ఫటల్ మెడిసిన్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హెబ్బాళ ఆసుపత్రి హెచ్‌ఓడీ ఉత్కర్ష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.03	1,575.77
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	120	129
సామర్థ్యం (టీఎంసీలు)	3.58	2.75

జిల్లాకోర్టు ఆవరణలో ఓటింగ్‌పై ప్రతిజ్ఞ



ఓటర్లతో ప్రమాణం చేయిస్తున్న న్యాయాధికారి

బళ్లారి సిటీ, మే 2: అర్హులైన ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం ఉందని, దీనిని మిస్ చేయకుండా మే 7న జరిగే లోక్‌సభ ఎన్నికలలో ఓటు వేయాలని డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయాధికారి పుష్పాంజలిదేవి కోరారు. జిల్లా స్వీప్ కమిటీ, ఆధ్వర్యంలో కొత్త జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఓటు వేయడం రాజ్యాంగం ప్రాథమిక హక్కు, అని 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత గల ఓటరు అవకాశాన్ని కోల్పోకుండా ఓటు వేసి మంచి నాయకులను ఎన్నుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా స్వీప్ కమిటీ ఛైర్మన్ జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ మే 7న పౌరులందరూ తప్పకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జీ , లీగల్ సర్వీసెస్ అథారిటీ పుష్పాంజలి దేవి ఓటర్లతో ప్రమాణం చేయించారు. ఈసందర్భంగా జిల్లాపంచాయితీ ముఖ్య ప్రణాళిక అధికారి వాగేశ్ శివాచార్యులు, జిల్లా బార్ అండ్ అసోషియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది ఎర్రిస్వామి పాల్గొన్నారు.

విమ్స్ ప్రొఫెసర్ వినాయక ప్రసన్న మృతి



ప్రొఫెసర్ వినాయక ప్రసన్న

బళ్లారి సిటీ.మే 2: బళ్లారి విమ్స్ విజ్ఞాన వైద్య శాస్త్ర విభాగం ప్రొఫెసర్ వినాయక ప్రసన్న(50) అనారోగ్యంతో బెంగళూరు ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం బళ్లారిలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల విమ్స్ వైద్యులు, భారతీయ వైద్యకీయ సంఘం వివిధ సంఘ సంస్థలు సంతాపాన్ని ప్రకటించాయి.

ఓటర్ స్లిప్‌ల పంపిణీ



ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్న ఆశా కార్యకర్తలు

సిరుగుప్ప, మే 2 : మే 7న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సమాజ సేవకులు అబ్దుల్ నబీ కోరారు. గురువారం సిరుగుప్ప పట్టణం 72వ పోలింగ్ కేంద్రం వద్ద అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. ఓటర్ స్లిప్‌లు, ఐడెంటిటీ కార్డుతో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బీఎల్వోలు తెలిపారు. ప్రజాప్రభుత్వ వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైనదని అబ్దుల్ నబీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

బీజేపీ యువమోర్చా అధ్యక్షుడి ప్రచారం



ప్రచారం చేస్తున్న యువమోర్చా అధ్యక్షుడు సిద్దప్ప

సిరుగుప్ప, మే 2 : బళ్లారి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప సిరుగుప్ప11వ వార్డులో కొప్పాళ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ బసవరాజు తరఫున ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటింటికి వెళ్లి దేశ ప్రధాని పదేళ్లపాటు చేసిన పనులను ప్రజలకు వివరించారు. మూడవసారి మోదీ అధికార పగ్గాలు చేపట్టాలంటే బసవరాజును గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బీజేపీ నగర అధ్యక్షులు విక్రమ్‌కుమార్ జైన్, 11వ వార్డు బీజేపీ నాయకులు బీఎస్ కుమార్, మహిళా అధ్యక్షురాలు మహాలక్ష్మీ, శేకప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లన్నీ నిర్మానుష్యం



బోసిపోతున్న కేవీ సర్కిల్ నుండి దుర్గమ్మగుడికి వెళ్లే రహదారి

- 41 డిగ్రీల సెల్సియస్ దాటిన ఉష్ణోగ్రత
- ఎండవేడిమితో బయటకురాని నగరవాసులు



జనసంచారంలేని సత్యనారాయణ పేట ఫ్లైఓవర్

బళ్లారి నగరంలో గురువారం ఉష్ణోగ్రత 41 డిగ్రీలు దాటడంతో మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు నగరవాసులు ఉక్కపోతతో ఇళ్లకే పరిమితమయ్యారు. తమను ఎవరో తరుముకు వస్తున్నట్టుగా జనం అంతా రోడ్లలో పరుగులు పెట్టి ఇళ్లకు చేరుకున్నారు. దీంతో మోకా వెళ్లే రహదారి, దుర్గమ్మ రహదారి తదితర రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పలువురు శాస్త్రవేత్తలు చెబుతున్న ప్రకారం ఈ వారం రోజుల్లో ఎండవేడిమి అధికం కానుంది. ప్రస్తుతం ఎండలు విపరీతంగా పెరగడంతో మూగజీవులు సైతం బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. ✍ బళ్లారిరూరల్

బీజేపీకి ప్రజ్వల్ తలనొప్పి

- డర్టీ వీడియోలపై నిప్పులు చెరుగుతున్న కాంగ్రెస్
- ప్రజ్వల్ ప్రభావం మలివిడత ఎన్నికలపై పడనుందా..?
- తలెత్తుకోలేకపోతున్న బళ్లారి, కొప్పళ్ నియోజకవర్గాల్లోని జేడీఎస్ కేడర్



బళ్లారి, మే 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి, దేవేగౌడ మనవడు ప్రజ్వల్ డర్టీ వీడియోలు కాంగ్రెస్ పార్టీకి అస్త్రంగా మారాయి. ఈ వీడియోలు రాజకీయంగా దుమారం రేపిన విషయం తెలిసిందే. సభ్యసమాజం తలవంచుకునే విధంగా ప్రజ్వల్ రేవణ్ణ మహిళలపై లైంగిక దాడి చేయడం గురించి తెలిసిన బీజేపీ జేడీఎస్‌తో ఎందుకు జతకట్టిందని కాంగ్రెస్ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కూటమి అభ్యర్థిగా హసన్ నుండి పోటీ చేయడానికి ఎందుకు అవకాశం ఇచ్చిందని కమ్యూనిస్టు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

మలివిడతలో 14 ఎంపీ స్థానాలకు మే 7న పోలింగ్ జరగనుంది. ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ పై దాడి చేయడానికి కాంగ్రెస్ కు అవకాశం దొరికింది. కాంగ్రెస్ నాయకులు కూడా ప్రత్యేకంగా బీజేపీనే టార్గెట్ చేసి మాట్లాడుతున్నారు. ప్రజ్వల్ రేవణ్ణ తన వీడియోలు బయట పడగానే విదేశాలకు వెళ్లిపోయాడు. విదేశాలకు వెళ్లిపోవడానికి కేంద్రం లో ఉండే బీజేపీనే సహకరించిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. మలివిడత ఎన్నికల్లో బీజేపీపై ప్రజ్వల్ ప్రభావం పడే అవకాశం ఉంద ని కూటమి అభ్యర్థులు కొందరు మథన చెందుతుండగా మరి కొందరు అది హసన్ ప్రాంతానికే పరిమితమని ఇక్కడ ఏమీ ఉండదని మరి కొందరు అంటున్నారు. బళ్లారి, రాయచూరు, కొప్పల్ జిల్లాల్లో జేడీఎస్ ఓటర్లు ఎక్కువగానే ఉన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రజ్వల్ డర్టీ వీడియోలు రాష్ట్రం అంతా సామాజిక మాధ్యమాల్లో చక్క ర్లు కొడుతున్నాయి. వాస్తవానికి ఆ డర్టీ విడియోలు చూసి పిల్లలు చెడిపోతారనే భయం తల్లిదండ్రుల్లో నెలకొంది. ఇదే విషయం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుండడం కారణంగా వాటిని తొలగించాలని కొందరు కోరుతున్నారు. మొత్తం మీద కూటమి అభ్యర్థి ప్రజ్వల్ కారణంగా తమకు కొంత నష్టం కలిగే అవకాశం ఉందని బీజేపీ నేతలు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం ఈ డర్టీ వీడియోల గురించి బాగా ప్రచారం చేస్తోంది.

కీచక ఎంపీకి ప్రధానమంత్రి మద్దతా?

మోదీపై రాహుల్ ధ్వజం



రాయచూరు సభలో ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

రాయచూరు, మే 2: జేడీఎస్ నాయకుడు ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతంతో ప్రధాని నరేంద్ర మోదీకి కర్ణాటకకు వచ్చేందుకు ముఖం చెల్లలేదని ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధి ఎద్దేవా చేశారు. వందల సంఖ్యలో మహిళలను వంచించిన వ్యక్తికి ప్రధాని అండగా నిలవడం సిగ్గుచేటన్నారు. స్వయంగా ప్రధాన మంత్రి, హోం మంత్రి సహకారంతోనే ప్రజ్వల్ రేవణ్ణ దేశం విడిచి పారిపోయాడని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం రాయచూరు నగరంలోని వాల్కాట్ మైదానంలో నిర్వహించిన ప్రజాధ్వని సభలో పాల్గొని రాహుల్ గాంధీ ప్రసంగించారు. 10 ఏళ్ల పాటు పాలన సాగించిన నరేంద్ర మోదీ అన్ని రాజ్యాంగ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని ప్రత్యర్థులను వేధించడం మినహా ప్రజలకు న్యాయం చేసిందేమి లేదన్నారు. మహిళలను అవమానపరిచిన ప్రజ్వల్ రేవణ్ణ దేశం విడిచి పారిపోతుంటే దర్యాప్తు సంస్థలు కళ్లు మూసుకున్నాయా? అని రాహుల్ ప్రశ్నించారు. దీని పై ప్రధాని, హోం మంత్రి మౌనం వీడి మహిళలకు బహిరంగంగా సమాధానం చెప్పాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటక ప్రజలకు ప్రజ్వల్ రేవణ్ణ విషయంలో నోరు విప్పాలన్నారు. కాగా ఇలాంటి వ్యకి మద్దతును కోరుతున్న ప్రధాని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మంత్రులు ఎన్.ఎస్.బోసరాజు, కేఎచ్ మునియప్ప, కేపీసీసీ కార్యాధ్యక్షుడు ఎ.వసంత్ కుమార్, ఎమ్మెల్యేలు బసనగౌడ దద్దల, హంపనగౌడ బాదర్లి, బసనగౌడ తుర్విహాళ్, డీసీసీ అధ్యక్షుడు బసవరాజ్ పాటీల్ ఇటగి తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి

● మాజీ సీఎం యడియూరప్ప



కురుగోడు సభలో మాట్లాడుతున్న మాజీ సీయం యడియూరప్ప

కంప్లి, మే 2 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అత్యధికస్థానాల్లో బీజేపీ గెలుపొంది మూడవసారి కూడా నరేంద్రమోదీ ప్రధానిగా కొనసాగుతారని మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తెలిపారు. జిల్లాలోని కురుగోడులో బీజేపీ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆయన తెలిపారు. దేశం ఆయన పాలన వల్లనే సురక్షితంగా వుంటుందన్నారు. సిద్దరామయ్య ప్రభుత్వం అభివృద్ధి బాటలో విఫలమైందన్నారు. కేవలం పథకాలు అమలుచేస్తున్నారేగానీ ఎలాంటి అభివృద్ధి జరగడంలేదన్నారు. రాష్ట్రంలో వుండే నిధులన్నీ పథకాలకే వెళతున్నాయన్నారు. అలాగే రాష్ట్రంలో అవినీతి పాలన జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. అలాగే ఇటీవలే నేహా అనే విద్యార్థినిని అందరి ముందు హతమార్చినా చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలపై దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నా వారికి రక్షణ కల్పించడంలో విఫలమైందన్నారు. జిల్లా లోక్‌సభ అభ్యర్థి గెలుపొంది నరేంద్రమోడీ పాలన కొనసాగితే గతంలో వారుకోరిన విధంగా కంప్లి, కురుగోడు మీదుగా బళ్లారికి రైలు మార్గం ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే కంప్లి వద్ద నూతన బ్రిడ్జికి త్వరలో ఏర్పాటు చేసి ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు. అనంతరం కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామికి పూజలు చేపట్టి స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం బీజేపీ అభ్యర్థి శ్రీరాములు మాట్లాడుతూ ఈసారి అవకాశం ఇస్తే జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సురేషబాబు, జిల్లా అధ్యక్షులు అనిల్ నాయుడు, ఎమ్మెల్సీ సతీష్, హళ్లి వీరేష్, మీనళ్లి తాయణ్ణ, తిమ్మారెడ్డి, రాజునాయక్, నటరాజు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి చావులోనూ... కర్తవ్యం మరువని పోలీసు అధికారి



తల్లితో పోలీసు అధికారి యల్లప్ప(ఫైల్)

బళ్లారిగాంధీనగర్,మే 2: తల్లి చనిపోయిందనే విషయం తెలిసినా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు ఆదర్శంగా నిలిచారు ఓ పోలీసు అధికారి. యల్లప్ప కాశప్పనవర్ హుబ్లి-ధారవాడ్ పోలీసు కమీషనర్ పరిధిలో రిజర్వ్ ఆర్మ్‌డ్ విభాగంలో డిసిపిగా విధులు నిర్వహిస్తున్నారు. యల్లప్ప కాశప్పనవర్ తల్లి బెళగావి జిల్లా పరిధిలోని సవదత్తిలో వార్ధక్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే సీనియర్ అధికారులకు విషయం తెలిపి తల్లి అంత్యక్రియల్లో పాల్గొనకుండా అదే రోజు మధ్యాహ్నం 12గంటలకు విధులకు హాజరయ్యాడు. తల్లి చనిపోయిన బాధలోనూ అమిత్‌షా కార్యక్రమంలో భద్రతా వ్యవస్థను సక్రమంగా నిర్వహించి శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం వాటిల్లకుండా విధులు నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసు కమీషనర్ రేణుకా సుకుమార్ యల్లప్పను ప్రశంసించారు.

జ్యువెలరీ షోరూమ్‌లో పేలుళ్లు...

- నలుగురికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం





జ్యువెలరీ దుకాణం నుంచి క్షతగాత్రులను విమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

బళ్లారి గాంధీనగర్, మే 2: నగరంలోని తేరువీధిలో ఉన్న కళ్యాణ్ జువలరీ షోరూమ్‌లో గురువారం సాయంత్రం 7గంటల సమయంలో భారీ స్థాయిలో పేలుళ్ళు జరిగాయి. ఈ కారణంగా షోరూమ్ అద్దాలు పగిలి మంటలు రేగడంతో షోరూమ్‌లో పనిచేస్తున్న నలుగురు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎండవేడిమికి షోరూమ్‌లో ఏర్పాటు చేసిన ఏయిర్ కండీషన్ యంత్రాలలో షార్ట్ షర్క్యూట్ జరిగి పెద్ద శబ్దంతో పేలిపోయాయి. ఈ కారణంగా అక్కడున్న సిబ్బంది మంటల్లో చిక్కుకుని వారి ఒళ్ళంతా కాలిపోయింది. వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి క్షతగాత్రులను విమ్స్‌కు తరలించారు.

జంగమరకల్లు గుడి క్యాంప్‌లో కాంగ్రెస్ ప్రచారం



ప్రచార సభలో మాట్లాడుతున్న వెంకటేశ్ తంగడిగి

గంగావతి రూరల్, మే 2: కొప్పళ లోక్ సభ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాల్ తరపున కనకగిరి ఎమ్మెల్యే శివరాజ్ తంగడిగి సహోదరుడు వెంకటేశ్ తంగడగి గురువారం జంగమరకల్లుగుడి గ్రామంలో కాంగ్రెస్ ప్రచార సభను నిర్వహించారు. ఈసందర్భంలో వెంకటేశ్ తండగిడిగి మాట్లాడుతూ గ్రామపంచాయితీలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమని, పల్లెలకు శ్రీమతి ఇందిరాగాంధీ వృద్ధాప్య వేతనాలను ఎన్నో పథకాలను అమలుపరిచి ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారన్నారు. ఈసందర్భంలో మాజీ కనకగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, సత్యనారాయణ,వెంకటేశ్,శ్రీనివాస్, రాంబాబు,సుబ్బారావు,మంజునాథ్,గిరప్ప పాల్గొన్నారు.

హోసూరు జోన్

వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు



మత్తిగిరిలో ఆరోగ్యమాత చర్చ్ నిర్వాహకుల ప్రార్థనలు

హోసూరు, మే 2: హోసూరు కార్పొరేషన్ పరిధిలో వర్షం కోసం పలు చోట్ల విశేష ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. మత్తిగిరిలోని ఆరోగ్యమాత చర్చ్ సమీపంలోని సరస్సు ఒడ్డున వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈనెల 31 వరకు ప్రతి రోజు సాయంత్రం సరస్సు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఫాదర్ క్రిస్టోఫర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు లేక మత్తిగిరి పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసిన తీవ్ర కరువు నెలకొందన్నారు. చర్చ్‌నుంచి భక్తులు మేరీ మాతా విగ్రహాన్ని ఊరేగింపుగా సరస్సు తీరానికి చేర్చారు. చర్చ్ ఫాదర్ క్రిస్టోఫర్ మాట్లాడుతూ 1924లో మత్తిగిరి కుదురేపాళ్యం సెయింట్ ఆరోగ్య ఆలయాన్ని నిర్మించి వంద సంవత్సరాలైందన్నారు. గతంలో కరువు సమయంలో వర్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసిన సందర్భాలలో దేవుడు కరుణించాడన్నారు.

పాఠశాల లైబ్రరీకి 5 వేల పుస్తకాల అందజేత

హోసూరు(సిఫ్‌కాట్), మే 2: హోసూరు కార్పొరేషన్ ములైనగర్ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థుల మేధో నైపుణ్యాలను పెంపొందించేందుకు పాఠశాలలో లైబ్రరీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాల లైబ్రరీకి అదనపు పుస్తకాలు అందించాలని పాఠశాల యాజమాన్యం కోరడంతో హోసూరులోని లయన్స్ క్లబ్ సానుకూలంగా స్పందించింది. హోసూరు ములైనగర్ ప్రభుత్వ పాఠశాల కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వైవీఎస్ రెడ్డి, హోసూరు ప్రభుత్వ పాఠశాల లైబ్రరీకి 5 వేల పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు గాంధీకి అందజేశారు. చంద్రారెడ్డి, లక్ష్మీపతి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పదేళ్లలో మోదీ చేసిందేమిటి: కేపీసీసీ

రాయచూరు, మే 2: 10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశం పురోగతి కోసం చేసిందేమిటో ప్రజలముందుంచాలని కేపీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ వినయ్ కుమార్ సొరకె సూటిగా నిలదీశారు. 10 ఏళ్ల అనంతరం జరుగుతున్న లోకసభ ఎన్నికల్లో చేసిన ప్రగతి గురించి చెప్పుకునే అవకాశం లేకనే మతం దేవుళ్ల పేరుతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గురువారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడిన వినయ్ కుమార్, 2014కు పూర్వం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని సాగించి ప్రజలను మభ్య పెట్టిన నరేంద్ర మోదీ తన 10 ఏళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను నిరాశలో ముంచేశారని ఎద్దేవా చేశారు. జీఎస్టీ పెంపు, నోట్ల రద్దు అన్ని రకాల ధరల పెరుగుదలతో పాటు అదానీ, అంబానీ వంటి వారి కార్పోరేట్ దిగ్గజాల ఆస్తులు పెంచడం మినహా దేశ ప్రజలకు మోదీ చేసిందేమిలేదన్నారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన సాగునీటి పథకాలు మహదాయి, భద్ర, కావేరి, మేకదాటు పథకాలకు కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డడం దౌర్భాగ్యమన్నారు. పదే పదే డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పే బీజేపీ నాయకులు తమ పాలన కాలంలో ఈ పథకాలను ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై బీజేపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బడ్జెట్ కాళీ అయ్యిందని అన్ని గ్యారెంటీ పథకాలను బంద్ అవుతాయంటు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇది దివాళకోరుతనమన్నారు. 15 సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఏ పథకానికి ఎలా నిధులు సరుదుబాటు చేయాలి, ఎలా ఖర్చు చేయాలనే విషయం స్పష్టంగా తెలుసని బీజేపీ వారితో చెప్పించుకొనాల్సిన అవసరం ముఖ్యమంత్రికి లేదన్నారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తు, ప్రత్యేర్థులను రాజకీయంగా దెబ్బతీస్తు కాలంవెళ్లదీస్తున్న బీజేపీకి ఎన్నికల్లో గుణపాఠం నేర్పాలన్నారు



విలేకరులతో మాట్లాడుతున్న వినయ్ కుమార్ సొరకె

తుకారామ్ గెలుపు కోసం జోరుగా ప్రచారం

కంప్లి, మే 2 : కంప్లి పట్టణంలో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి ఈ తుకారామ్ గెలుపు కోసం 6వ వార్డు కౌన్సిలర్ బట్టా ప్రసాద్ ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పథకాలు, అభ్యర్థి మంచి మనస్తత్వం గెలుపుకు నాంది పలుకుతాయన్నారు. ఇప్పటికే బూత్ స్థాయిలో తుకారామ్ గెలుపు కోసం తమ వంతుగా ప్రచారం చేపడుతున్నామన్నారు. అదేవిధంగా కుడితిని పట్టణంలో కూడా 6వవార్డులో పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్ తుకారామ్ గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ నాయకుడు ఈ తుకారామ్ కుడితిని పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాడు. అలాగే సండూరు నియోజకవర్గాన్ని కూడా జిల్లాలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాడని తెలిపారు. ఆయనతో పాటు అంజి, పెద్దప్ప, మోటా తిమ్మప్ప, మాంతేష్, హనుమంతు, విరుపాక్షి, కంబళి రామకృష్ణ, రఘు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇందిర క్యాంటీన్‌కు సర్వే

కంప్లి, మే 2: రాష్ట్రంలో పలు చోట్ల నూతన ఇందిర క్యాంటీన్‌లకు నూతన నిర్మాణాలు జరుగుతున్నాయి. అదే విధంగా కంప్లి బస్టాండు ఆవరణలో కూడా ఇందిర క్యాంటీన్ ఏర్పాటు కోసం స్థలం కొలతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సర్వే పూర్తయిందని వారికి కావాల్సిన స్థలం సిద్దంగా వుందన్నారు. త్వరలోనే డీఎంఏ సంస్థ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

బళ్లారి నగరంలో పోలీసుల కవాతు



బళ్లారి నగరంలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కవాతు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

బళ్లారిరూరల్, మే 2 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బళ్లారి నగరంలో ఎస్పీ రంజిత్ కుమార్ భండారి, అడిషనల్ ఎస్పీ కేపీ రవికుమార్, పలు పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలు కవాతు నిర్వహించారు. నగరంలోని కప్పగల్ రోడ్డు, దుర్గమ్మ గుడి సర్కిల్, రాయల్‌సర్కిల్, బ్రూస్ పేట పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రధాన కూడళ్ల మీదుగా ఈ కవాతు సాగింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు.